సాక్షి
అనంతపురం

గురువారం । 28 । డిసెంబర్ । 2023



హుండీ కానుకల లెక్కింపు

కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో హుండీ కానుకలను బుధవారం లెక్కించారు.

8లో



టమాట కిలో రూ.20

కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.20 పలికింది. కనిష్టం రూ.6.50, సరాసరి రూ.13 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్ఠం/కనిష్ఠం
34.4°/12.9°

జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి తీవ్రత పెరిగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 4 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

భద్రత పటిష్టంగా ఉండాలి



రికార్డు పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు, కంట్రోలింగ్ యూనిట్లు భద్రపరిచిన గోదాము వద్ద భద్రత పటిష్టంగా ఉండాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. నగరంలోని పాత ఆర్డీఓ కార్యాలయ ఆవరణలోని గోదాములో భద్రపరిచిన ఈవీఎంలను కలెక్టర్ బుధవారం పరిశీలించారు. భద్రత ఏర్పాట్ల గురించి ఎన్నికల సెల్ తహసీల్దార్ భాస్కర్‌ను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు, కంట్రోలింగ్ యూనిట్ల భద్రత విషయంలో రాజీ పడకూడదన్నారు. పోలీసు బందోబస్తు నిరంతరం ఉండేలా చూడాలన్నారు. సీసీ కెమెరాలు నిరంతరం పనిచేయాలని చెప్పారు.

22న తుది ఓటరు జాబితా



క్లెయిమ్‌ల ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల రోల్ అబ్జర్వర్ మురళీధర్‌రెడ్డి (ఫైల్)

అనంతపురం అర్బన్: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ–2024 కార్యక్రమానికి సంబంధించి గతంలో ఇచ్చిన షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం మార్పు చేసింది. సవరణ ప్రక్రియలో భాగంగా అందిన క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం ఈ నెల 26న పూర్తి చేయాల్సి ఉండింది. వాటి పరిష్కార గడువును 2024 జనవరి 12 వరకు పొడిగించింది. తుది ఓటర్ల జాబితా సన్నద్ధ ప్రక్రియను జనవరి 1 నాటికి పూర్తి చేయాల్సి ఉండగా గడువును జనవరి 17 వరకు పొడిగించింది. తుది ఓటరు జాబితా జనవరి 5న ప్రకటించాల్సి ఉండగా గడువును జనవరి 22 పొడిగించారు. ముఖ్యంగా కొత్త ఓటరు నమోదు, ఓట్ల తొలగింపు దరఖాస్తులను అత్యంత పారదర్శకంగా పరిశీలించి పరిష్కరించాల్సి ఉన్నందున గడువును ఎన్నికల కమిషన్ పెంచినట్లు అధికారవర్గాలు తెలిపాయి.

'జీఎస్‌ఐ'లో అమృత్ మహోత్సవ్



విద్యార్థులతో జీఎస్‌ఐ అధికారులు

వజ్రకరూరు: మండల కేంద్రంలోని వజ్రాల ప్రక్రమణ కేంద్రంలో బుధవారం కేంద్ర గనుల మంత్రిత్వశాఖ ఆదేశాలకు అనుగుణంగా బుధవారం ఆజాదీకా అమృత్ మహోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీజీ హెచ్‌ఓడీ సీహెచ్ వెంకటేశ్వరరావు, జీఎస్‌ఐఎస్ డిప్యూటీ డీజీ ఎస్ఎన్ మహాపాత్రో, ఏపీ జీఎస్‌ఐ డైరెక్టర్ ఎంపీ కేసరి, సీనియర్ జియాలజిస్టులు ప్రశాంత్ కుమార్‌మిశ్రా, అశ్రుమోచన్‌సాహూ, రీతూ రాయ్, వసుధామిశ్రా తదితరులు పాల్గొని ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంపై విద్యార్థులను చైతన్య పరిచారు. కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. అనంతరం కింబర్‌లైట్ నమూనాలు, ప్లాంట్‌లో జరిగే ప్రాసెసింగ్ పై అవగాహన కల్పించారు.

శాశ్వత లోక్ అదాలత్ తీర్పు ఫైనల్



మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాసరావు

అనంతపురం: ప్రజా ప్రయోజన సేవల శాశ్వత లోక్ అదాలత్ ఇచ్చే తీర్పు అప్పీలు లేని శాశ్వత తీర్పు అవుతుందని శాశ్వత లోక్ అదాలత్ ధర్మాసనం చైర్మన్/ జడ్జి కె.శ్రీనివాసరావు అన్నారు. న్యాయ సేవా సదన్‌లో ప్రజా ప్రయోజన సేవల శాఖల ప్రభుత్వ అధికారులకు శాశ్వత లోక్ అదాలత్‌లో ప్రజా ప్రయోజన కేసుల పరిష్కారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రజా ప్రయోజనల సేవల శాశ్వత లోక్ అదాలత్‌లో ఫిర్యాదు దాఖలుకు ఎటువంటి రుసుమూ చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. కోటి రూపాయల పరిహారం వరకు, వివాదాల పరిష్కారానికి తీర్పు వెలువరించగల అధికారం కలిగి ఉందన్నారు. శాశ్వత లోక్ అదాలత్ సభ్యులు ఎం.రాజశేఖర్‌రెడ్డి, సీనియర్ న్యాయవాది పద్మజ శాశ్వత లోక్ అదాలత్ గురించి ప్రసంగించారు. కార్యక్రమంలో మునిసిపల్ కార్పొరేషన్లు, విద్యుత్ శాఖ, పోస్టల్, హౌసింగ్, డ్వామా, కోర్టు భవనాలు, ఎల్ఐసీ, ప్రభుత్వ ఆసుపత్రి, విద్యాశాఖ తదితరుల అధికారులు హాజరయ్యారు.



ఇది అనంతపురంలోని 21వ డివిజన్ అంబేడ్కర్‌నగర్‌లో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు. ఎస్సీలు ఎక్కువగా ఉండే ఈ ప్రాంతంలో గత ప్రభుత్వాలు ఎటువంటి అభివృద్ధి పనులూ చేపట్టలేదు. 30 ఏళ్ల కింద వేసిన రోడ్డుపైకి వర్షాకాలంలో మురుగునీరు వచ్చి చేరేది. భరించలేని దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు పడేవారు. 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పర్యటించినప్పుడు సీసీ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు.



పెద్దపప్పూరు మండలం చిక్కేపల్లిలో ఇదివరకు వర్షం కురిసిందంటే చాలు రోడ్డుపై నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది. 'గడప గడపకూ మన ప్రభుత్వం' ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించేందుకు గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి ప్రజలు ఈ సమస్యను వివరించారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి సైడ్ కాలువ నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు.

జనంతోనే.. జనం మధ్యే

- చరిత్రలో తొలిసారి ప్రజల మధ్యే ప్రభుత్వం
- 579 సచివాలయాల పరిధిలో ప్రజల వద్దకు ఎమ్మెల్యేలు
- పలు సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు
- 3వేలకు పైగా తక్షణ పనులకు రూ.110 కోట్ల వ్యయం
- ఫ్యామిలీ ఫిజీషియన్, ఆరోగ్య సురక్ష ద్వారా లక్షలాది మందికి వైద్యం

అనంతపురం జిల్లాలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' సాగిందిలా..

మొత్తం సచివాలయాలు	613
ఎమ్మెల్యేలు విజిట్ చేసినవి	579
సచివాలయాల పరిధిలో పనుల మంజూరు	3,069
పనులు జరుగుతున్నవి	1,186
పనులు పూర్తయినవి	1,722
పనులకు మంజూరు చేసిన నిధులు	రూ.110 కోట్లు



అనంతపురం నగరంలోని 35వ డివిజన్ మారుతీనగర్‌లో 150 స్వయం సహాయక సంఘాలున్నాయి. సంఘాల సభ్యులు సమావేశం నిర్వహించుకోవడానికి సరైన వేదిక ఉండేది కాదు. భవనం మంజూరు చేయాలని గతంలో ఎంతమందికి విన్నవించినా పట్టించుకోలేదు. ఇటీవల 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే అనంత దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లడంతో ఆయన పొదుపు సంఘాల మహిళల సమావేశ భవనం కోసం రూ.20 లక్షలు మంజూరు చేయించారు. నిర్మాణం చకచకా సాగిపోయింది. ఇప్పుడు సభ్యులు ఇందులోనే సమావేశాలు నిర్వహించుకుంటున్నారు.

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ప్రభుత్వ పాలనలో ఇదొక కొత్త ట్రెండు. బహుశా దేశంలో ఏ రాష్ట్రమూ అమలు చేయని విధంగా జరుగుతున్న తీరు ఇది. ఎన్నికల ఫలితాలు రాగానే ప్రజల ముఖం చూడని నేతలు, ప్రభుత్వాలనే ఇన్నాళ్లు చూశారు. కానీ ప్రభుత్వ పగ్గాలు చేపట్టాక ప్రజల మధ్యే, ప్రజలతోనే ఉండే ప్రభుత్వాలు ఇప్పటివరకూ ఎక్కడా లేవు. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో తప్ప. పాలనా పగ్గాలు చేపట్టాక ఏకంగా నాయకులే ఇంటింటికీ వెళ్లి పలకరించిన పరిస్థితి ఇక్కడే జరిగింది. ఇలా ఒకటి కాదు రెండు కాదు అటు అధికారులు, ఇటు నాయకులు రెండున్నరేళ్లుగా తమ మధ్యే ఉండటంతో జనంలో కొత్త భరోసా వచ్చింది.

ఇంటింటికీ వెళ్లడం తొలిసారి

ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఆయా గ్రామాలకు వెళ్లడం ఐదేళ్ల కాలపరిమితిలో జరగడం కష్టమే. అలాంటిది ప్రతి గ్రామంలో, ప్రతి ఇంటికీ తిరగడం ఇదే తొలిసారి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 12 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్తలు 85 శాతం మంది ప్రజలను కలిశారు. వాళ్ల ఇంటికి ఎంత మేలు జరిగిందీ వివరించారు. ఏవైనా సమస్యలుంటే పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. రేషన్ కార్డులు, పెన్షన్‌లు సత్వరమే మంజూరు చేయించారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో చెంతకే వైద్యం

రాష్ట్రంలో ఒకప్పుడు ప్రభుత్వాస్పత్రులకు వెళ్తే వైద్యులు కనిపించని పరిస్థితి. ఇప్పుడు ఇంటివద్దకే వచ్చి వైద్యపరీక్షలు చేసి జబ్బుకు మందులు ఇస్తున్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామానికీ డాక్టర్ వెళ్లడం, ఆయా సచివాలయ పరిధిలోనే ఒకచోటకు పేషెంట్లను తీసుకొచ్చి వైద్యసేవలు అందిస్తున్నారు. రమారమి ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా 4 లక్షల మందికి పైగా లబ్ధి పొందారు.

భరోసానిచ్చిన 'ఆరోగ్య సురక్ష'

అధికారులు, వైద్యులు, పారామెడికల్ సిబ్బంది గంపగుత్తగా గ్రామాలకే వెళ్లి కొత్త తరహా వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కింది. తొలిదశలో 413 ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహించారు. మధుమేహం, రక్తపోటు, ఎనీమియాతో పాటు రకరకాల దీర్ఘకాలిక జబ్బులను గుర్తించారు. వీళ్లందరికీ యుద్ధ ప్రాతిపదికన వైద్యం అందించారు. మసకచూపుతో బాధపడే వారికి కళ్లద్దాలు ఉచితంగా ఇచ్చారు. పెద్ద జబ్బులకు రెఫరల్ ద్వారా ఆరోగ్యశ్రీ కింద వైద్యమందించారు. రెండో దశలో మళ్లీ జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు ప్రారంభం కానున్నాయి. ఇలా ప్రభుత్వమంటే ప్రజలతోనే, ప్రజల మధ్యే అన్నది ఒక్క ఏపీలో మాత్రమే జరిగింది.

చెంతకే వైద్యం ఎంతో బాగుంది



నేను చాలా రోజులుగా బీపీ, షుగర్‌తో బాధపడుతున్నాను. క్రమం తప్పకుండా మందులు వాడాలని డాక్టర్లు సూచించారు. కళ్యాణదుర్గం వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలంటే చాలా ఇబ్బందిగా ఉండేది. నాలాంటి వారి కోసం జగన్ సర్కారు ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా వైద్యులనే గ్రామాలకు పంపి.. అవసరమైన పరీక్షలు చేయించి.. మందులు ఉచితంగా ఇస్తోంది. ప్రభుత్వం చేసిన ఈ మేలు మాకు ఎంతో ఉపశమనం కలిగిస్తోంది.

– రత్నమ్మ, కోనాపురం, బ్రహ్మసముద్రం మండలం

థ్యాంక్యూ జగనన్న



వ్యవసాయ పనులు చేసుకుంటూ భార్య, ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్నా. నాకు నాలుగు నెలల నుంచి విపరీతమైన నడుమునొప్పి, కడుపునొప్పి బాధిస్తోంది. పెద్ద డాక్టర్ల దగ్గరకు వెళ్లే స్తోమత లేక ఏవో నొప్పుల మాత్రలు వాడాను. నొప్పి తగ్గినట్టే తగ్గి మళ్లీ తీవ్రం అయ్యేది. మా గ్రామంలో ఇటీవల జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహించారు. నన్ను డాక్టర్ పరీక్షించి కిడ్నీలో రాళ్లు ఉన్నట్లు గుర్తించారు. మెరుగైన వైద్యం కోసం సిఫార్సు చేశారు. పైసా ఖర్చు కాకుండా ఆపరేషన్ చేసి కిడ్నీల్లో రాళ్లను తొలగించారు. ఆరోగ్య సురక్ష క్యాంపు లేకపోయి ఉంటే నేను సమస్యను తెలుసుకోలేకపోయేవాడిని. ఇంతటి బృహత్తర కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు.

– బెస్త మనోహర్, కసాపురం, గుంతకల్లు మండలం

రీ-సర్వే వేగవంతం చేయండి

- అధికారులకు జేసీ కేతన్‌గార్గ్ ఆదేశం



జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష కార్యక్రమంలో భాగంగా జిల్లాలో రీ-సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. నాలుగో విడత కింద ఎంపిక చేసిన 120 గ్రామాల్లో సర్వే ప్రారంభించాలన్నారు. రీ-సర్వే అంశంపై జాయింట్ కలెక్టర్ బుధవారం కలెక్టరేట్ నుంచి డీఆర్‌ఓ, ఆర్డీఓలు, సర్వే ఏడీ, తహసీల్దార్లు, రీ-సర్వే డిప్యూటీ తహసీల్దార్లు, సర్వేయర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మూడో విడత కింద సర్వే చేపట్టిన 115 గ్రామాల్లో ఇప్పటి వరకు 94 గ్రామాల్లో గ్రౌండ్ ట్రూథింగ్, గ్రౌండ్ వ్యాలిడేషన్ పూర్తి చేసి డీఎల్ఆర్ (డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్టర్) సిద్ధం చేశారన్నారు. సర్వే ప్రక్రియ పూర్తయిన గ్రామాల్లో భూ హక్కు పత్రాల పంపిణీ, హద్దు రాళ్ల ఏర్పాటును నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. మండల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి మిగిలిన 21 గ్రామాల్లో ఈ నెలాఖరుకు సర్వే ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇక నాలుగో విడతలో 120 గ్రామాల్లో రీసర్వే పనులు ప్రారంభించాలని చెప్పారు. సమావేశంలో డీఆర్‌ఓ గాయత్రీదేవి, సర్వే భూ రికార్డుల శాఖ ఏడీ రూప్లానాయక్, సూపరింటెండెంట్ బాలాజీ, రీ-సర్వే తహసీల్దార్ మారుతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఏపీఐఐసీ చైర్మన్‌గా మరోసారి మెట్టు



రాయదుర్గం: ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ) చైర్మన్‌గా రాయదుర్గం మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి మరోమారు నియమితులయ్యారు. 2021లో తొలిసారి నియమితులైన మెట్టును రెండోసారి కూడా కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఏపీఐఐసీ చైర్మన్ బాధ్యతను సక్రమంగా నెరవేరుస్తానని మెట్టు గోవిందరెడ్డి తెలిపారు.

సర్వే పక్కాగా చేపట్టాలి

అనంతపురం కార్పొరేషన్: కుష్టు వ్యాధి గుర్తింపు సర్వే పక్కాగా చేపట్టాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం నగరంలోని ఇందిరానగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో కుష్టు వ్యాధి గుర్తింపు కార్యక్రమాన్ని డీఎంహెచ్‌ఓ ప్రారంభించారు. జనవరి 12 వరకు సర్వే జరుగుతుందని డీఎంహెచ్‌ఓ తెలిపారు. కుష్టు వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే వైకల్యం రాకుండా చర్యలు తీసుకోవచ్చన్నారు.

మేము విధుల్లో ఉన్నాం

- సమ్మెలోకి వెళ్లలేదు
- గ్రామ వలంటీర్ల స్పష్టీకరణ
- సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వలంటీర్లు

గార్లదిన్నె: తాము విధుల్లోనే ఉన్నామని సచివాలయ వలంటీర్లు స్పష్టం చేశారు. సమ్మెలోకి వెళ్లినట్లు జరుగుతున్న దుష్ప్రచారాన్ని, 'ఈనాడు'లో ప్రచురిస్తున్న కథనాలను ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మెగా క్రీడా టోర్నీ 'ఆడుదాం ఆంధ్రా'లో అధికారులు తమకు కేటాయించిన బాధ్యతలను నిర్వర్తిస్తున్నామని చెప్పారు. బుధవారం కల్లూరు గ్రామ సచివాలయం పరిధిలోని రైతు భరోసా కేంద్రం వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి వలంటీర్లు క్షీరాభిషేకం చేశారు. పలువురు వలంటీర్లు మాట్లాడుతూ తమకూ ప్రభుత్వానికి మధ్య అగాథం పెంచే కుట్రలో భాగంగానే ఉద్యోగ భద్రత, గౌరవ వేతనం పెంపు కోసం సమ్మెబాట పడుతున్నట్లు కొన్ని పత్రికలు, సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం జరుగుతోందని ధ్వజమెత్తారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, సేవలను తమ పరిధిలోని ప్రజల చెంతకు చేరుస్తున్నామన్నారు. మండల వ్యాప్తంగా ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల నిర్వహణలో వలంటీర్లందరూ భాగస్వాములయ్యామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వలంటీర్లు ఉమాదేవి, భవాని, సుహాసిని, వెంకటేష్, సాయి, మహబూబ్ బాషా, ఆదినారాయణ, హరి, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ కలెక్టర్లకు పోస్టింగ్

అనంతపురం అర్బన్: ఉమ్మడి జిల్లాలో తహసీల్దార్లుగా ఉంటూ డిప్యూటీ కలెక్టర్లుగా ఉద్యోగోన్నతి పొందిన ఇద్దరికి ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్. జవహర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ కలెక్టర్ సి.విశ్వనాథ్‌కు అనంతపురం హెచ్‌పీసీఎల్ (హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్) ఎస్‌డీసీగా నియమించారు. శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన డిప్యూటీ కలెక్టర్ టి.శ్రీనివాసులును హిందూపురం ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌గా నియమించారు.

ఆధ్యాత్మిక కల్పవల్లి.. భక్తరపల్లి

- వైభవంగా లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు
- ఆకట్టుకున్న భూతప్ప, జ్యోతుల ఉత్సవాలు



బోర్ల పడుకున్న భక్తులపై నుంచి నడిచి వస్తున్న భూతప్ప

మడకశిర రూరల్: దక్షిణ భారతదేశంలోనే ప్రసిద్ధి గాంచిన భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లేడు గుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో కీలకమైన భూతప్పల పాదస్పర్శ ఘట్టం బుధవారం కమనీయంగా సాగింది. వేలాది మంది భక్తులు జ్యోతులు తీసుకువచ్చి స్వామివార్లకు సమర్పించారు. ఉత్సవంలో రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు తదితర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి స్వామివార్లకు పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

జ్యోతులు తెచ్చి.. ప్రదక్షిణలు చేసి..

ఉత్సవాలకు వేలాదిగా తరలివచ్చిన భక్తులు బుధవారం తెల్లవారుజామునే ఆంజనేయ స్వామి, లక్ష్మీ నరసింహస్వామి దర్శనానికి పోటెత్తారు. మహిళలు బియ్యపు పిండి, బెల్లంతో తయారు చేసిన జ్యోతులను తీసుకువచ్చి స్వామివార్లుకు సమర్పించారు. దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే పలువురు భక్తులు మొక్కు చెల్లించడంలో భాగంగా వేరుశనగ కాయలు, కొబ్బరికాయలు, అరటిపండ్లు తదితర వాటిని గోపురంపైకి విసిరారు. అనంతరం నిర్వహించిన 'పొంజు' ఉత్సవం కూడా భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. పొంజుతో తలపై కొడితే కష్టాలు తీరుతాయన్న నమ్మకంతో భక్తులు పొంజుతో తలపై కొట్టించుకునేందుకు పోటీపడ్డారు. అలా పొంజుతో కొట్టిన వారికి కానుకలు సమర్పించారు. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను నడిపారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ ఆదేశాలు మేరకు సీఐ సురేష్‌బాబు పోలీసు గట్టి బందోబస్తు నిర్వహించారు. దేవదాయ, ధర్మదాయ శాఖ అధికారులు, రథోత్సవ కమిటీ సభ్యులు బ్రహ్మోత్సవాలను పర్యవేక్షించారు. అర్చకులు భక్తులకు ప్రసాదం అందజేశారు. దాతలు, కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కోర్కెలు తీరతాయని...



నేను భూతప్పల ఉత్సవంలో పాల్గొన్న. భూతప్ప పాదస్పర్శతో కోరిన కోర్కెలు తీరతాయని అందరూ చెబుతుంటే ఇక్కడికి వచ్చా. మడి స్నానంతో భూతప్పలు వచ్చే మార్గంలో పడుకున్నా. భూతప్ప నాపై కాలుమోపారు. నా కష్టాలు, కోర్కెలు తీరతాయని నమ్మకం ఉంది.

– అన్నపూర్ణ, రెడ్డిపల్లి, పెనుకొండ



స్వామివార్లకు జ్యోతులు మోసుకొస్తున్న భక్తులు



భూతప్ప పాద స్పర్శ కోసం వేచి చూస్తున్న భక్తులు

జిల్లాలో రెండు కరోనా కేసులు

అనంతపురం మెడికల్: జిల్లాలో రెండు కరోనా కేసులు నమోదయ్యాయి. ఇందులో అనంతపురం లక్ష్మీనగర్‌కు చెందిన 55 ఏళ్ల వ్యక్తి, కళ్యాణదుర్గానికి చెందిన 66 ఏళ్ల మహిళ ఈ నెల 26న ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో కరోనా పరీక్షలు చేయించుకున్నారు. వీరికి పాజిటివ్ అని తేలింది. ప్రస్తుతం వీరు ఇళ్లల్లోనే ఉంటున్నారు. సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు రెండు పాజిటివ్ కేసుల జాబితాను డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవికి పంపారు. డీఎంహెచ్‌ఓ తక్షణం స్పందించి కేసులు నమోదైన ప్రాంతాలకు వెళ్లి లక్షణాలు ఏవిధంగా ఉన్నాయో తెలుసుకోవాలని ఆరోగ్య శాఖ సిబ్బందిని ఆదేశించారు. బాధితుల కుటుంబ సభ్యులకు కోవిడ్ నిర్ధారణ పరీక్షలు చేపట్టాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

భయపడాల్సిన పని లేదు

కరోనా కేసులు నమోదైనప్పటికీ ఎవరూ భయపడాల్సిన పని లేదని డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి అన్నారు. లక్షణాలను బట్టి కొద్ది రోజులు ఐసోలేషన్‌లో ఉండి, చికిత్స తీసుకుంటే సరిపోతుందన్నారు. సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కరోనా పాజిటివ్ కేసులకు సాధారణ జలుబు, దగ్గు, తదితర లక్షణాలు మాత్రమే ఉన్నాయన్నారు. తీవ్రమైన సమస్య లేదని స్పష్టం చేశారు. అనుమానిత కేసులకు రోజూ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. బుధవారం 42 మందికి కోవిడ్ నిర్ధారణ పరీక్షలు చేశామన్నారు. కోవిడ్ రోగుల కోసం సర్వజనాస్పత్రిలో ఈఎన్‌టీ వార్డు పక్కన 30 పడకల సామర్థ్యంతో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు.



క్లుప్తంగా

రైల్వే స్టేషన్‌లో సౌకర్యాలు మెరుగు పరచండి


రైల్వే స్టేషన్‌లో కొత్తగా నిర్మించిన గదులను పరిశీలిస్తున్న కన్సల్టెంట్ కమిటీ సభ్యులు

అనంతపురం సిటీ: జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా వసతులు సమకూరుస్తామని, రైల్వే స్టేషన్ కన్సల్టెంట్ కమిటీ డివిజనల్, స్టేషన్ కమిటీ ప్రతినిధులు తెలిపారు. అనంతపురం రైల్వే స్టేషన్‌లో బుధవారం వారు పర్యటించారు. కమిటీ సభ్యులు రవీంద్రనాథరెడ్డి, కృష్ణమూర్తి, ఆళ్లగడ్డ రాము, శ్రీనివాసులు, శివనారాయణశెట్టిను స్టేషన్ మేనేజర్ అశోక్, ఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ ప్రతాప్ నాయక్, వివిధ విభాగాధిపతులు సాదరంగా ఆహ్వానించారు. ఒకటో రోడ్డు వైపున కొత్తగా నిర్మించిన ప్రయాణికుల విశ్రాంత భవనాలు, కార్యాలయాలు, ఇతర విభాగాలను పరిశీలించారు. రైల్వే స్టేషన్ విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్న నేపథ్యంలో వాటికి గల కారణాలను కమిటీ సభ్యులు ప్రత్యక్షంగా పరిశీలించారు. బాత్‌రూముల్లో తాగునీటి కనెక్షన్లు ఇవ్వకపోవడం, ప్రయాణికులు కూర్చొనేందుకు బెంచీలు ఏర్పాటు చేయకపోవడాన్ని, రాత్రి సమయాల్లో లైటింగ్ సమస్య ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. వీటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

29న కార్గోలో వస్తువులకు వేలం

అనంతపురం సెంట్రల్: ఉమ్మడి జిల్లాలోని ఏపీఎస్ ఆర్టీసీ కార్గో రవాణా విభాగంలో డెలివరీ కాకుండా నిలిచిపోయిన వస్తువులను వేలం వేయనున్నారు. ఈ మేరకు ఏటీఎం (కమర్షియల్) మోతీలాల్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మూడు నెలలుగా వినియోగదారులు తీసుకెళ్లకుండా వదిలేసిన 36 వస్తువులకు శుక్రవారం ఉదయం 10.30 గంటలకు అనంతపురం డిపో ప్రాంగణంలోని కార్గో కార్యాలయంలో వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొనాలని కోరారు.

వ్యభిచార గృహంపై దాడి

అనంతపురం క్రైం: స్థానిక వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని భైరవ నగరు 9వ క్రాస్‌లో నిర్వహిస్తున్న వ్యభిచార గృహాన్ని పోలీసులు ఆకస్మిక తనిఖీ చేశారు. జన సంచారమున్న ప్రాంతంలో కొంత కాలంగా వ్యభిచార గృహం నిర్వహిస్తున్నట్లు స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే తనిఖీలు చేపట్టారు. ఇద్దరు మహిళలను, ఐదుగురు విటులను అరెస్ట్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరుపరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎస్టీయూ వజ్రోత్సవ పోస్టర్ల విడుదల


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఈఓ నాగరాజు, ఎస్టీయూ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) వజ్రోత్సవ వేడుకల పోస్టర్లను బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి వి.నాగరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ నాయకులు మాట్లాడుతూ... రాష్ట్రోపాధ్యాయ సంఘం ఏర్పాటై 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జనవరి 12, 13 తేదీల్లో కర్నూలు నగరంలో వజ్రోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు జి సూర్యుడు, ప్రధాన కార్యదర్శి ఎస్.రమణారెడ్డి, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, రాష్ట్ర కౌన్సిలర్ ఫణిభూషణ్, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, నాగభూషణ, జిల్లా ఉపాధ్యక్షుడు దారం చంద్రశేఖర్, సీనియర్ నాయకులు కిష్టప్ప సురేష్, కిషోర్, కుల్లాయప్ప, రామకృష్ణ పాల్గొన్నారు.

టీడీపీలో మూడు ముక్కలాట

- దుర్గం టికెట్ కోసం పోటాపోటీ
- టికెట్ మాదంటే మాదంటున్న ఉన్నం, ఉమా వర్గీయులు
- తెరపైకి కొత్తగా అమిలినేని
- వర్గ పోరుతో ఇప్పటికే కకావికలమైన పార్టీ కార్యకర్తలు

కళ్యాణదుర్గంలో ఈసారి టీడీపీ పరిస్థితి మూడు ముక్కలాటగా మారింది. 2019 ఎన్నికల్లో పరాభవం పొందిన తర్వాత టీడీపీలో రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరు ఊపందుకుంది. అంతర్గత కుమ్ములాటతో కార్యకర్తలు కకావికలమయ్యారు. ఈ క్రమంలో ఇరువర్గాలను సర్ది చెప్పే ప్రయత్నం చేసినా వినకపోవడంతో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ సైతం చివరకు చేతులెత్తేశారు.



కళ్యాణదుర్గం: త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కళ్యాణదుర్గం నియోజకవర్గ టీడీపీ టికెట్ కోసం ఆ పార్టీ ఇన్‌చార్జ్ మాదినేని ఉమామహేశ్వర నాయుడు, మరోవైపు మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి కుమారుడు ఉన్నం మారుతీచౌదరి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో వీరిద్దరి మధ్య వర్గ పోరు తారాస్థాయికి చేరుకుంది. టికెట్ మాదంటే మాదంటూ ఇద్దరూ ఎవరికి వారు కార్యకర్తలను ఉసిగొల్పుతూ వర్గపోరుకు ఆజ్యం పోస్తూ వస్తున్నారు. వీరి తీరుతో అధిష్టానం సైతం విసుగు చెంది మూడో వ్యక్తికి టికెట్ కట్టబెట్టేందుకు ఆలోచిస్తున్నట్లు సమాచారం. విషయం తెలుసుకున్న ఎస్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత అమిలినేని సురేంద్రబాబు... ఈ సారి కళ్యాణదుర్గం బరిలో టీడీపీ తరఫున తానున్నానంటూ సంకేతాలు ఇవ్వడంతో టికెట్ ఎవరికనేది ఉత్కంఠ నెలకొంది.

ష్యూరిటీకి గ్యారెంటీ లేకుండా పోయింది

పార్టీ టికెట్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్న ఉమామహేశ్వరనాయుడు టీడీపీ పెద్దల ఆదేశాల మేరకు 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ' పేరుతో గ్రామాల్లో పలు కార్యక్రమాలు చేపట్టారు. టికెట్ గ్యారెంటీగా దక్కుతుందో లేదో తెలియదు కానీ ఈ సారి తమకే టికెట్ ఖాయమంటూ తన వర్గీయులతో ముమ్మర ప్రచారం చేయిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తమ కుటుంబంలోని ఒకరికి పార్టీ టికెట్ ఇస్తానంటూ ఇటీవల చంద్రబాబు ష్యూరిటీ ఇచ్చారంటూ మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి, ఆయన తనయుడు ఉన్నం మారుతీచౌదరి, ఆయన భార్య ఉన్నం వరలక్ష్మి బాహాటంగానే పేర్కొంటున్నారు. ఈ క్రమంలోనే వారూ తమదైన శైలిలో నియోజకవర్గంలో తిరుగుతూ ఓటర్లను ఆకర్షించే పనిలో పడ్డారు. మహాలక్ష్మి పథకం పేరుతో ఇంటింటికీ వెళ్లి మహిళలకు చీరలు, పసుపు, కుంకుమ, గాజులు అందజేస్తూ ప్రలోభాలకు గురి చేసే ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

తెరపైకి సురేంద్ర

కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 2024లో టీడీపీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎస్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత అమిలినేని సురేంద్రబాబు పేరు అనూహ్యంగా తెరపైకి వచ్చింది. 2014 ఎన్నికలకు ముందు కళ్యాణదుర్గం అసెంబ్లీ అభ్యర్థిగా సురేంద్ర పేరును పరిశీలించిన టీడీపీ అధిష్టానం చివరి నిమిషంలో ఆయనను కాదని ఉన్నం హనుమంతరాయ చౌదరికి అవకాశం ఇచ్చింది. తిరిగి 2019 ఎన్నికల్లో టికెట్ ఆశించిన సురేంద్రకు భంగపాటు తప్పలేదు. ఆ సమయంలో సురేంద్రను బుజ్జగించి ఉమామహేశ్వరనాయుడికి టికెట్ ఇచ్చారు. తమకు దక్కకపోయినా పర్వాలేదు మరొకరికి మాత్రం దక్కనివ్వకూడదనే భావనతో 2019 ఎన్నికల్లో ఉమా గెలుపును అడుగడుగునా ఉన్నం కుటుంబసభ్యులు అడ్డుకున్నారు. అప్పటి నుంచి వీరిద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేంత వైరం నెలకొంది. 2019 ఎన్నికల తర్వాత స్తబ్దుగా ఉన్న సురేంద్రబాబు పేరును పార్టీ అధిష్టానం అనూహ్యంగా తెరపైకి తీసుకురావడం గమనార్హం.

అనంత బాలోత్సవాలను విజయవంతం చేయండి

- జిల్లా విద్యాశాఖ అధికారి నాగరాజు


పోస్టర్లను విడుదల చేస్తున్న డీఈఓ నాగరాజు

అనంతపురం ఎడ్యుకేషన్: అనంత బాలోత్సవాల కమిటీ ఆధ్వర్యంలో 2024, ఫిబ్రవరి 5, 6, 7 తేదీల్లో అనంతపురం ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరిగే అనంత పిల్లల పండుగ–4 (అనంత బాలోత్సవాలు)ను విజయవంతం చేయాలని డీఈఓ వి.నాగరాజు పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను బుధవారం ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. అనంత బాలోత్సవాల పేరుతో పిల్లల పండుగను గతంలో మూడుసార్లు నిర్వహించినట్లు గుర్తు చేశారు. దేశభక్తి గేయాలు, నాటికలు తదితర పోటీలతో మూడు రోజులు అత్యంత ఉత్సాహభరితంగా నిర్వహించినట్లు తెలిపారు. వేలాది మంది విద్యార్థులు అత్యంత ఉత్సాహంగా, క్రమశిక్షణతో పాల్గొని తమలోని సృజనాత్మకత చాటుకున్నారన్నారు. సాంస్కృతిక కళలతో ఆకట్టుకున్నారన్నారు. అదే తరహాలో ఫిబ్రవరిలో జరిగే బాలోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో డీఈఓ కార్యాలయ సూపరింటెండెంట్లు శ్రీనాథ్, ఆదినారాయణ, యూటీఎఫ్ సీనియర్ నాయకులు, అనంత బాలోత్సవ కమిటీ కోశాధికారి మహమ్మద్ జిలాన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సావిత్రమ్మ, కమిటీ సభ్యులు సురేష్, ఎస్టీయూ సూర్యుడు, చంద్రశేఖర్, యూటీఎఫ్ లింగమయ్య, రమణయ్య ఐద్వా రామాంజనమ్మ, రాజేశ్వరి పాల్గొన్నారు.

ఉనికి కోసమే జేసీపీఆర్ రాద్ధాంతం

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



అనంతపురం ఎడ్యుకేషన్: తాడిపత్రి ప్రాంతంలో రాజకీయంగా జీరో అయిన జేసీ కుటుంబం నేడు ఉనికి కోసం లేనిపోని రాద్ధాంతం చేస్తోందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మండిపడ్డారు. బుధవారం ఆయన అనంతపురంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో విలేకరులతో మాట్లాడారు. జేసీ కుటుంబం సాగిస్తున్న అరాచక పాలనకు గత ఎన్నికల్లో తాడిపత్రి నియోజకవర్గ ప్రజలు సమాధి కట్టారన్నారు. అప్పటి నుంచి మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారన్నారు. ఈ క్రమంలోనే తనపై అసత్య ప్రచారాలు సాగిస్తూ కరపత్రాలు వేస్తున్నాడని, వీటిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. తనకున్న ఆస్తులన్నీ సక్రమమేనని స్పష్టం చేశారు. దీనిపై బహిరంగ చర్చకు తాను సిద్ధంగా ఉన్నానన్నారు. జెండాలు తొలగించకుండా సుందరీకరణ పనులు చేస్తామని జేసీ లేఖ ఇచ్చారన్నారు. ఇప్పుడేమో వైఎస్సార్‌సీపీ జెండాలు తొలగించాలని ఆందోళన చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బ్లాక్‌మెయిల్ రాజకీయాలతో కాలం నెట్టుకొస్తున్న జేసీ ప్రభాకరరెడ్డి దమ్ముంటే తాను నిజాయితీపరుడినని నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. బినామీ పేర్లతో తాడిపత్రి మున్సిపల్ పరిధిలోని ఆస్తులను కొల్లగొట్టింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఇంత కాలం తాను ఎంతో ఓర్పుతో ఉన్నానని, ఇకపై నోరు జారితే ఊరుకునేదే లేదని స్పష్టం చేశారు. ప్రశాంతంగా ఉన్న నియోజకవర్గంలో గొడవలు సృష్టించి లబ్ధి పొందాలనుకుంటే చీడ పురుగులను ఏరేసినట్లు ఏరి వేస్తానని హెచ్చరించారు.

కేజీబీవీపై దుష్ప్రచారం

- ఫుడ్ పాయిజన్ అంటూ టీడీపీ సోషల్ మీడియాలో పోస్టులు


ఫుడ్‌పాయిజన్ కాలేదని తెలుపుతున్న శింగనమల కేజీబీవీ విద్యార్థినులు

శింగనమల: మండల కేంద్రంలోని కేజీబీవీలో ఫుడ్ పాయిజన్ జరిగిందంటూ తెలుగు తమ్ముళ్లు చేస్తున్న దుష్ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దంటూ ఆ పాఠశాల విద్యార్థులు అన్నారు. బుధవారం ఉదయం 6.30 గంటలకే టీడీపీ సోషల్ మీడియాలో ఫుడ్ పాయిజన్ అంటూ టీడీపీ నేతలు వైరల్ చేశారు. గంట తర్వాత ఈ అంశాన్ని సామాజిక మాధ్యమాల్లో నుంచి తొలగించారు. దీంతో ఆందోళనకు గురైన విద్యార్థులు... ఉపాధ్యాయుల సాయంతో విలేకరుల సమావేశం పెట్టి మాట్లాడారు. ఫుడ్‌పాయిజన్ అంటూ అవాస్తవాలను ప్రచారం చేయడం ద్వారా తల్లిదండ్రులు కలత చెంది తమను పిలుచుకెళ్లేందుకు వస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షలు దగ్గర పడుతున్న సమయంలో అవాస్తవాలతో తమ భవిష్యత్తును నాశనం చేయాలనుకోవడం తగదన్నారు. దీనిపై పోలీసులు లోతుగా విచారణ చేసి మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ గీతారాణి మాట్లాడుతూ.. తమ పాఠశాలలో ఎలాంటి ఫుడ్ పాయిజన్ జరగలేదని, కావాలనే కొందరు సామాజిక మాధ్యమాలను అడ్డుపెట్టుకుని అవాస్తవాలతో ప్రజలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. పరీక్షల సమయం దగ్గర పడుతున్న తరుణంలో విద్యార్థుల జీవితాలతో ఆడుకోవడం సిగ్గుచేటన్నారు.

31న ఏహెచ్‌ఏ అభ్యర్థులకు పరీక్ష

అనంతపురం అగ్రికల్చర్: పశు సంవర్ధకశాఖ పరిధిలో పనిచేసేందుకు ఆసక్తి కనబరుస్తూ అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్ (ఏహెచ్‌ఏ) పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 31న పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ శాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలో భర్తీ కానున్న 473 పోస్టులకు 915 మంది అభ్యర్థులు చేసుకోగా.. వీరికి ఈ నెల 31న ఆన్‌లైన్ విధానంలో పరీక్ష ఉంటుంది. ఇందు కోసం అనంతపురం జిల్లా కలెక్టర్ గౌతమి ఆదేశాలతో 7 పరీక్షా కేంద్రాలు, చీఫ్ సూపరింటడెంట్లు, ఇతర సిబ్బందిని నియమించారు. ఎస్‌ఆర్‌ఐటీ, అనంతలక్ష్మి, పీవీకేకే, బాలాజీ పీజీ కాలేజీతోపాటు తాడిపత్రిలోని తాడిపత్రి ఇంజనీరింగ్ కళాశాల, సీవీ రామన్ ఇంజనీరింగ్ కళాశాలను పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేశారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ 150 మార్కులకు పరీక్ష ఉంటుంది. అభ్యర్థులు 9.15 గంటలకు పరీక్షా కేంద్రాల్లో ఉండాలి. ఆ తరువాత అనుమతించబోరు.

ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్‌గా సుబ్బయ్య

అనంతపురం అగ్రికల్చర్: రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ (ఏపీ సీడ్స్) జిల్లా మేనేజర్‌గా గుంటూరులో పనిచేస్తున్న జి.సుబ్బయ్య నియమితులయ్యారు. దీంతో బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న జె.ధనలక్ష్మి కర్నూలు జిల్లాకు బదిలీ అయ్యారు. ఖరీఫ్, రబీలో రైతులకు అవసరమైన విత్తన వేరుశనగ, విత్తన పప్పుశెనగ, కందులు, ఇతరత్రా చిరుధాన్యాలు రాయితీతో ఇవ్వడానికి వీలుగా సకాలంలో అందుబాటులోకి తెస్తామన్నారు. అలాగే పురుగు మందులు సరఫరా, అమ్మకాలు కూడా మొదలు పెట్టనున్నట్లు తెలిపారు. వ్యవసాయశాఖ సమన్వయంతో ఆర్‌బీకే వేదికగా రైతులకు సేవలందించడానికి కృషి చేస్తామన్నారు. బదిలీపై వెళుతున్న జె.ధనలక్ష్మి గత రెండేళ్లుగా అందించిన సమర్థవంతమైన సేవలను కొనియాడుతూ ఏపీ సీడ్స్ సిబ్బంది ఘనంగా సత్కరించారు.

నెట్టికంటుడి హుండీ కానుకల లెక్కింపు

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్య క్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో హుండీ కానుకల లెక్కింపు బుధవారం చేపట్టారు. 44 రోజులకు గానూ రూ.57,08,187 నగదు, అన్నదానం హుండీ ద్వారా రూ.48,622 నగదు సమకూరినట్లు ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్ తెలిపారు. అలాగే 10సింగపూర్ డాలర్లు, 5 సౌదీ అరేబియా రియాల్, 41 యూఎస్‌ఏ డాలర్లతో పాటు 3.150 కిలోల వెండి, 0.050 గ్రాముల బంగారాన్ని భక్తులు కానుకల రూపంలో సమర్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీసీ సేవాసమితి సభ్యులు, బళ్లారికి చెందిన వీరభద్రసేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థిపై దుప్పి దాడి

వజ్రకరూరు: పాఠశాలకు వెళుతున్న విద్యార్థిపై దుప్పి దాడి చేసింది. వివరాలు... మండలం పీసీ ప్యాపిలితండాకు చెందిన బాబూనాయక్ వజ్రకరూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం గ్రామం నుంచి సైకిల్‌పై పాఠశాలకు బయలుదేరిన విద్యార్థి పీసీ కొత్తకోట వద్దకు చేరుకోగానే ఓ దుప్పి దాడి చేసింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన బాబూ నాయక్‌ను అటుగా వెళుతున్న వారు గమనించి ఉరవకొండలోని ఆస్పత్రికి చేర్చారు.

జనవాక్కు

మరువలేని సాయం



ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత మా కుటుంబానికి చేసిన మేలును మరువలేం. గతంలో ఎన్నడూ లేనంతగా జగన్ ప్రభుత్వంలోని ప్రతి సంక్షేమ పథకాన్నీ అందుకున్నా. ఎక్కడేగాని ఆఫీసల చుట్టూ తిరగలేదు. ఎవరి సిఫారసు తీసుకెళ్లలేదు. వలంటీర్ వ్యవస్థ చాలా సమర్థవంతంగా పనిచేస్తోంది. వైఎస్సార్ ఆసరా, రైతు భరోసా, వైఎస్సార్ సున్నావడ్డీ, చేయూత, పింఛన్ కానుక తదితర పథకాలతో మా కుటుంబ ఆర్థిక పరిస్థితి చాలా మెరుగుపడింది. పేదలకు అండగా నిలిచిన వైఎస్ జగన్‌కే మా మద్దతు.

– బోయగడ్డ లాలెమ్మ, బేతాపల్లి, గుత్తి మండలం

మా పాలిట దేవుడు



కార్పెంటరీ పనులతో జీవనం సాగిస్తున్న నేను మూడేళ్ల క్రితం జరిగిన ఓ ప్రమాదంలో కాళ్లు, చేతులు సచ్చుబడ్డాయి. శరీరం కదల్లేక ఇబ్బంది పడ్డాను. నా పరిస్థితి చూసి వలంటీర్ రమేష్ బాబు చొరవ తీసుకుని నాకు పింఛన్ వచ్చేలా చేశారు. ప్రతి నెలా నాకు రూ.5వేల పింఛన్ అందుతోంది. నా భార్య తనూజకు ఆసరా పథకం లబ్ధి చేకూరింది. నా కుమార్తె ఆశాబీకి వితంతు పింఛన్ వస్తోంది. అమ్మ ఒడి పథకం వర్తించడంతో మనుమరాలిని చదివించుకుంటున్నాం. మేము అడగకనే మా అవసరాలు ఏమిటో తెలుసుకుని తీరుస్తున్న సీఎం వైఎస్ జగన్ మా కుటుంబానికి దేవుడితో సమానం.

– నబీ సాహెబ్, గోళ్ల, కళ్యాణదుర్గం మండలం

ఆర్థిక ఇబ్బందులు దూరమయ్యాయి



జగన్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మా కుటుంబలో ఆర్థిక ఇబ్బందులు దూరమయ్యాయి. వివిధ సంక్షేమ పథకాల లబ్ధి చేకూరింది. అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన వంటి పథకాలతో మా కుమారుడిని, కుమార్తెను చదివించుకోగలుగుతున్నాం. ఈ పథకాలే లేకుంటే పిల్లలు మాతో పాటు కూలీలుగా మారేవారు. సీఎం వైఎస్ జగన్ మేలు మరువలేం. ఆయనకే మా మద్దతు.

– ఎద్దుల నాగరత్నమ్మ, బ్రాహ్మణపల్లి, కూడేరు మండలం

క్లుప్తంగా

అయోధ్య అక్షింతలతో శోభాయాత్ర



ర్యాలీ చేపట్టిన ఆర్యవైశ్యులు

అనంతపురం కల్చరల్: రామ జన్మభూమి తీర్థ క్షేత్ర వారి ఆధ్వర్యంలో దేవాలయాలకు చేరుకున్న అయోధ్య రామాలయం అక్షింతలతో కొత్తూరు అమ్మవారి శాల వారు బుధవారం శోభాయాత్ర నిర్వహించారు. వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయ కమిటీ అధ్యక్షుడు గోపామచ్చానరసింహులు మాట్లాడుతూ.. దేశ వాసుల ఆకాంక్షలకు అద్దం పడుతూ సాగుతున్న అయోధ్య అక్షింతలు వాసవీ అమ్మవారి శాలకు రావడం ఆనందంగా ఉందన్నారు. అక్షింతలను జనవరి మొదటి వారంలో ఇంటింటికీ వితరణ చేస్తామన్నారు. రాజు రోడ్డులోని ఆర్యవైశ్య వసతి గృహం నుంచి టవర్‌క్లాక్ మీదుగా కొత్తూరు అమ్మవారి శాలకు చేరుకున్న ర్యాలీలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు విజయ్, మహిళా మండలి అధ్యక్షురాలు నిర్మల తదితరులు భక్తిగీతాలు ఆలపించారు.

నేడు 'గాయత్రి మహాయజ్ఞ కుండలం'

అనంతపురం కల్చరల్: మనిషిని ఆధ్యాత్మికంగా, మానసికంగా శక్తివంతుడిని చేసే 24 యజ్ఞ కుండలాల గాయత్రి మహాయజ్ఞ శృంకల ఉభయ జిల్లాల్లో జరుగుతుందని నిర్వాహకులు ప్రసాద్, సూర్యప్రకాష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 28న అనంతలోని లలితకళాపరిషత్తులో, 29న ధర్మవరంలోని కొత్తపేట సాయిబాబా గుడి ఆవరణలో భారీ ఎత్తున యజ్ఞాలు జరుగుతాయని పేర్కొన్నారు. వాతావరణంలో బ్యాక్టీరియా నిర్మూలన, ఓజోన్ పొర రక్షణకు సాగే యజ్ఞాల్లో అందరూ పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

బాలరాజు కుటుంబానికి ఆర్థికసాయం



బాలరాజు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ప్రభాస్ అభిమాన సంఘం నాయకులు

కనగానపల్లి: విద్యుత్ ప్రమాదానికి గురై మృతి చెందిన హీరో ప్రభాస్ అభిమాని బాలరాజు (29) కుటుంబానికి అభిమాన సంఘం నాయకులు రూ.2 లక్షల ఆర్థికసాయం అందజేశారు. మండలంలోని మామిళ్లపల్లి గ్రామానికి చెందిన బాలరాజు ఈనెల 21న సలార్ సినిమా విడుదల సందర్భంగా ధర్మవరం పట్టణంలో ఒక థియేటర్ వద్ద ఫ్లెక్సీ కడుతూ విద్యుత్ ప్రమాదానికి గురై మృతి చెందాడు. ధర్మవరానికి చెందిన ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకులు బుధవారం మామిళ్లపల్లి గ్రామానికి వచ్చి బాలరాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం వారి అసోసియేషన్ తరఫున రూ.2 లక్షల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శివక్రిష్ణ, ఉపాధ్యక్షుడు నరేష్, సెక్రటరీలు ఆది, ఆషు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా'



ఆత్మకూరులో క్రీడాకారులకు బ్యాట్ అందజేసిన ఎంపీడీఓ రఘునాథ్

ఆత్మకూరు: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో బుధవారం రెండో రోజు ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. ఆత్మకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న క్రీడా పోటీలను ఎంపీడీఓ రఘునాథ్ పరిశీలించారు. క్రీడాకారులకు క్రీడా సామగ్రి అందజేశారు. సచివాలయాల పరిధిలో ఎలాంటి సమస్యలు లేకుండా క్రీడలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని మహిళ మృతి



శింగనమల: చికిత్స పొందుతూ గుర్తు తెలియని మహిళ మృతి అనంతపురంలో మృతి చెందింది. ఎస్ఐ విజయభాస్కర్ తెలిపిన వివరాలు.. సోమవారం ఉదయం 10 గంటల సమయంలో రోడ్డు మీద నడుచుకుంటూ వెళ్లుతున్న గుర్తు తెలియని మహిళ(45) అనంతపురం –తాడిపత్రి రోడ్డు పోతురాజుకాల్వ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు 108లో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం మృతి చెందింది. మృతురాలి ఆచూకీ తెలిసిన వారు 9346010588 నంబరులో సంప్రదించాలని ఎస్ఐ సూచించారు.

వైఎస్సార్‌సీపీతోనే బడుగులకు న్యాయం

- సీఎం వైఎస్ జగన్ సామాజిక విప్లవాన్ని తీసుకొచ్చారు
- 29న జరిగే బస్సుయాత్రను విజయవంతం చేయాలి
- మేయర్ వసీం పిలుపు



మాట్లాడుతున్న మేయర్ వసీం, చిత్రంలో డిప్యూటీ మేయర్లు కోగటం, వాసంతి సాహిత్య

అనంతపురం కార్పొరేషన్: దేశ చరిత్రలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అండగా నిలిచారు. ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగేందుకు కృషి చేసి, రాష్ట్రంలో సామాజిక విప్లవాన్ని తీసుకొచ్చారని మేయర్ వసీం పేర్కొన్నారు. బుధవారం నగరపాలక సంస్థలోని మేయర్ చాంబర్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. జనరల్ స్థానాలు ఉన్న ప్రాంతాల్లోనూ బడుగులకు సీఎం అవకాశం కల్పించారన్నారు. మైనార్టీగా తనకు మేయర్ పదవి కేటాయించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో డిప్యూటీ సీఎం, నలుగురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మెన్లు, తదితర పదవులను కేటాయించినట్లు గుర్తు చేశారు. నగరంలోని 50 మంది కార్పొరేటర్లుంటే అందులో 34 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గానికి చెందినవారే ఉన్నారని తెలిపారు. ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు నవరత్నాల ద్వారా ప్రత్యక్షంగా రూ.3.40 లక్షల కోట్లు అందించారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం చంద్రబాబు మైనార్టీల అభివృద్ధికి రూ.2 వేల కోట్లు ఖర్చు చేస్తే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాలుగున్నరేళ్లలోనే రూ.23 వేల కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు.

బస్సు యాత్రకు తరలిరండి..

ఈనెల 29న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో పాతూరు గాంధీ విగ్రహం వద్ద జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని మేయర్ పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీలకు ప్రభుత్వం చేసిన మేలును బస్సు యాత్ర ద్వారా తెలియజేయనున్నట్లు తెలిపారు. కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు, నాయకులు పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని హాజరువుతున్నట్లు తెలిపారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. 54 మంది బీసీ, బీసీ ఉపకులాలకు సంబంధించిన వారికి కార్పొరేషన్ చైర్మన్ పదవులను సీఎం కేటాయించారన్నారు. ప్రతి బీసీ ఉపకులానికి ఒక నాయకత్వాన్ని తీసుకువచ్చి, వారి రాజకీయ చైతన్యానికి కారణమయ్యారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 134 కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో 63 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు కేటాయించిన గొప్ప నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని కొనియాడారు. డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావించిన సీఎం జగన్ అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. గత ప్రభుత్వాలు కేవలం ఓటు బ్యాంకు కోసమే బడుగులను వాడుకున్నారని మండిపడ్డారు. తమ ప్రభుత్వంలో అన్ని వర్గాల అభ్యున్నతికి జగనన్న కృషి చేశారన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు కమల్‌భూషణ్, శ్రీనివాసులు, పార్టీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్, జేసీఎస్ కన్వీనర్ చింతకుంట మధు పాల్గొన్నారు.

ప్రచార రథాలు ప్రారంభం

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని పాతూరు గాంధీ విగ్రహం వద్ద ఈనెల 29న జరిగే సామాజిక సాధికార బస్సు యాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మేయర్ వసీం కోరారు. బుధవారం ఎమ్మెల్యే నివాసం వద్ద ఏర్పాటు చేసిన ప్రచార రథాలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల అభివృద్ధికి సీఎం జగన్ చర్యలు తీసుకున్నారన్నారు. బడుగులకు చేసిన మేలును తెలియజేసేందుకు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జ్ రిలాక్స్ నాగరాజు మాట్లాడుతూ..

ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని పాటల రూపంలో నగర ప్రజలకు వివరిస్తూ, బస్సు యాత్ర విజయవంతం చేయాలని ప్రజలను కోరుతామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, రజక కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మీసాల రంగన్న, బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, శ్రీదేవి, కృష్ణవేణి, పార్టీ సీనియర్ నేత చింతా సోమశేఖర్ రెడ్డి, క్లస్టర్ అధ్యక్షుడు ఓబిరెడ్డి, పీవీ రమణారెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, చింతకుంట మధు పాల్గొన్నారు.



జెండా ఊపి బస్సుయాత్ర ప్రచార రథాలను ప్రారంభిస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్లు

బస్సుయాత్ర విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసులు

అనంతపురం కార్పొరేషన్: సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేద్దామని ఏపీ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం శ్రీనివాసులు పిలుపునిచ్చారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 29న పాతూరు గాంధీ విగ్రహం వద్ద సామాజిక సాధికార బస్సు యాత్ర బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. నాయీ బ్రాహ్మణులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయీ బ్రాహ్మణులను రాష్ట్రంలో ఓ గౌరవ స్థానంలో ఉంచారన్నారు. నవరత్నాల ద్వారా నాయీ బ్రాహ్మణులు ఆర్థిక ప్రగతి సాధించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల అభ్యున్నతికి కృషి చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి అండగా నిలవాలన్నారు. సమావేశంలో నాయీ బ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, జిల్లా యువజన నాయకులు శివ, సుబ్బు, గోల్డెన్ మంజు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడి పూజ



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, పామిడి వీర, తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి



భోజనం చేస్తున్న అయ్యప్ప మాలధారులు

ఆత్మకూరు: తోపుదుర్తి గ్రామంలోని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి నివాసంలో బుధవారం అయ్యప్ప స్వామి పడి పూజను ఘనంగా నిర్వహించారు. తొలుత అయ్యప్ప స్వామి విగ్రహాన్ని 18 మెట్లతో ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, పూజలు చేపట్టారు. నియోజకవర్గంలోని అయ్యప్ప మాలధారులు పెద్ద ఎత్తున హాజరై భజనలు చేశారు. ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి, సతీమణి మరోరమ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి, ప్రియదర్శిని, తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి తదితరులు పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు, అయ్యప్ప మాలధారులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ఏడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ పామిడి వీరాంజనేయులు, ఏడీసీసీ డైరెక్టర్ జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వామియే శరణం అయ్యప్ప



హరిహర దేవాలయం వద్ద భక్తుల సందడి

- ఘనంగా అయ్యప్ప గ్రామోత్సవం

అనంతపురం కల్చరల్: స్థానిక అశోక్‌నగర్‌లోని హరిహర దేవాలయంలో జరుగుతున్న అయ్యప్ప స్వామి ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి వందలాది అయ్యప్ప స్వాములు పురవీధుల్లో స్వామిని ఊరేగించారు. నగర వీధులు అయ్యప్ప స్వామి నామస్మరణతో మార్మోగాయి. కన్యకలు జ్యోతులతో ఊరేగింపులో పాల్గొని స్వామివారి గీతాలకనుగుణంగా నర్తించారు. అశోక్‌నగర్ నుంచి అంబేడ్కర్ భవన్, విద్యుత్‌నగర్ వీధుల్లో అయ్యప్ప మాలధారులు భజన చేశారు. అనంతరం ఆలయంలో గురుస్వాముల నేతృత్వంలో భిక్ష, తీర్థప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో అయ్యప్ప అన్నదాన సమితి ప్రతినిధులు ఆకుల రాఘవేంద్ర, రాజారమేష్, వెంకటేష్ గురుస్వామి, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



బాణాసంచా కాలుస్తున్న దృశ్యం



అయ్యప్పను అలంకరిస్తున్న మాలధారులు

పోటీ పరీక్షల్లో సత్తా చాటండి



మాట్లాడుతున్న ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ చింతా సుధాకర్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం విద్యార్థులకు వివిధ పోటీ పరీక్షలపై అవగాహన కల్పించేందుకు బుధవారం సదస్సు నిర్వహించారు. ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ చింతా సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి అభ్యర్థి పోటీ పరీక్షల్లో తమ ప్రతిభను మెరుగుపరచుకోవడానికి ఈ సదస్సు దోహదం చేస్తుందన్నారు. ఎస్కేయూ నుంచే సింహభాగం పోటీ పరీక్షల్లో గణనీయంగా ఎంపిక అవుతుంటారనే నమ్మకాన్ని నిలబెట్టాలన్నారు. పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణను అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నారు. బుధవారం తొలి రోజు మాజీ పీఆర్వో డాక్టర్ బాలకృష్ణ స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు తీసుకున్నారు. గతంలోనూ ఉచితంగా వర్సిటీ విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు నిర్వహించారు. అనంతరం ఇన్‌చార్జ్ వీసీ న్యాయశాస్త్ర విభాగాన్ని సందర్శించి టీచింగ్ కన్సెల్టెంట్ల ఎంపికకు జరుగుతున్న ఇంటర్వ్యూలను పర్యవేక్షించారు. ఎల్‌ఎల్‌బీ మొదటి సంవత్సరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. క్రమశిక్షణతో కూడిన నడవడికను అలవరచుకోవాలని కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.శ్రీరాములు, న్యాయశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎం. శ్రీరాములు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా షటిల్ కోర్టు



సిద్ధార్థ పార్క్‌లో షటిల్ కోర్టు నిర్మాణానికి చదును చేసిన దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని రాంనగర్‌లో నిర్మాణ దశలో ఉన్న సిద్ధార్థ పార్క్‌లో ఎటువంటి అనుమతులు లేకుండా కొందరు యువత గుంతలు తీసి షటిల్ కోర్టు ఏర్పాటుకు గ్రావెల్ వేశారు. ఈనెల 25 నుంచి ఈ పనులు చేపడుతున్నా.. నగరపాలక సంస్థ అధికారులు అటువైపు తొంగిచూడలేదు. అనుమతులు లేకుండా షటిల్ కోర్టు ఏర్పాటు చేయకూడదని సచివాలయ ఉద్యోగి చెప్పినా వినలేదు. మాజీ ఎమ్మెల్యేతో కమిషనర్‌కు ఫోన్ చేయిస్తాం.. మీ పని మీరు చేసుకోవాలని సిబ్బందితో దౌర్జన్యంగా వ్యవహరించారు. నగరవాసులకు ఆనందాన్నిచ్చే పార్క్‌లో అనుమతులు లేకుండా పనులు చేయకూడదు. కానీ కొందరు యువత దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నా నగరపాలక సంస్థ అధికారులు పట్టించుకోవడం లేదు.

టీఎన్ఎస్ఎఫ్‌వి చౌకబారు విమర్శలు



మాట్లాడుతున్న వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మదిరెడ్డి నరేంద్రరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: పేద, సామాన్య మధ్యతరగతి కుటుంబాల్లోని విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మదిరెడ్డి నరేంద్రరెడ్డి అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల టీఎన్ఎస్ఎఫ్ నాయకులు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ఎత్తేస్తూ చేసిన విమర్శలపై మండిపడ్డారు. 14 ఏళ్ల పాటు సీఎంగా పని చేసిన చంద్రబాబు నాయుడు ఏనాడైనా విద్యార్థుల గురించి ఆలోచించారా అని ప్రశ్నించారు. విద్యార్థులు క్రీడల్లో రాణించి జాతీయ స్థాయికి ఎదగాలనే ఉద్దేశంతో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి సీఎం జగన్ శ్రీకారం చుట్టారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పెద్ద ఎత్తున కార్యక్రమం చేపడితే విద్యార్థుల నుంచి స్పందన వస్తోందన్నారు. ఐపీఎల్‌లోనూ ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు ప్రాతినిథ్యం వహించాలని సీఎం జగన్ భావించారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా లక్షలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న వేల పోస్టులను భర్తీ చేయడం జరిగిందన్నారు. దీన్ని ఓర్వలేని టీడీపీ చౌకబారు విమర్శలు చేస్తోందన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలే తప్పక బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సుధీర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులు విజయ్‌కుమార్, నవీన్‌కుమార్, నాయకులు నవీన్ రెడ్డి, చరణ్‌రాం, తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. వీరభద్రస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

గుమ్మఘట్ట: మండలంలోని తాళ్లకెర గ్రామంలో బుధవారం వీరభద్రస్వామి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మూలవిరాట్‌కు ఆలయ అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో తీసుకువచ్చి అందంగా అలంకరించిన రథంలో అధిష్టించి పురవీధులలో మేళతాళాలు, డప్పులతో ఘనంగా ఊరేగించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు ఆంధ్రా, కర్ణాటక రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మొక్కులు చెల్లించుకున్నారు. యువకులు, చిన్నారులు చేసిన నందికోళ్ల నృత్యం, చెక్కభజనలు ఆకట్టుకున్నాయి.

ప్యాక్ హౌస్‌లు సద్వినియోగం చేసుకోండి



గోవిందరాయునిపేటలో నిర్మించిన ప్యాక్ హౌస్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన అధికారి రఘునాథరెడ్డి

శింగనమల: పండ్ల తోటల రైతులు సమగ్ర ఉద్యాన పథకం కింద ప్యాక్‌హౌస్‌లను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యాన అధికారి రఘునాథరెడ్డి సూచించారు. గోవిందరాయునిపేట గ్రామంలో రైతు శివశంకర్‌రెడ్డి నిర్మించిన ప్యాక్‌హౌస్‌ను బుధవారం పరిశీలించారు. ప్రభుత్వం రైతుల కోసం రాయితీపై పలు పథకాలను అందిస్తోందన్నారు. అనంతరం రైతు సాగు చేసిన డ్రాగన్ ఫ్రూట్ తోటను పరిశీలించారు. పంటలో తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయ సంచాలకుడు నరసింహారావు, మండల ఉద్యాన అధికారి శైలజ పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం కల్పిస్తోందని జిల్లా ఉద్యానశాఖ అధికారి రఘునాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం రోటరీపురం, జంతలూరు, కొట్టాలపల్లిలో రైతులు సాగు చేసిన ఉద్యాన పంటలను పరిశీలించారు. ముందుగా మండలంలో ఎంత మంది రైతులున్నారు, ఎన్ని ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారని మండల ఉద్యాన శాఖ అధికారి శైలజను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన పంటల సాగుపై రాయితీలు కల్పిస్తోందన్నారు. అనంతరం రైతులు సాగు చేసిన అరటి, దానిమ్మ, పందిరి సాగు చేస్తున్న ద్రాక్ష పంటల సాగులో యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల వాటి నివారణపై అవగాహన కల్పించారు. ఉద్యాన శాఖ సహాయ సంచాలకుడు నరసింహారావు, రైతు భరోసా అధికారి నేత్రా, జగన్, రైతులు పాల్గొన్నారు.

3న 'దిశ' కమిటీ సమావేశం

అనంతపురం సిటీ: జిల్లా అభివృద్ధి సమన్వయ/పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం జనవరి 3న జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని డీపీఆర్‌సీ భవన్‌లో నిర్వహించనున్నట్లు జెడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారి కేతన్‌గార్గ్ బుధవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు 'దిశ' కమిటీ చైర్మన్/ఎంపీ తలారి రంగయ్య అధ్యక్షతన సమావేశం ప్రారంభమవుతుందని వివరించారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, కలెక్టర్ గౌతమి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కమిటీ సభ్యులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. దీంతో అన్ని శాఖల అధికారులు సమగ్ర సమాచారంతో విధిగా హాజరు కావాలని కోరారు.

ఉన్నత పాఠశాల తనిఖీ

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను డిప్యూటీ డీఈఓ శ్రీదేవి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాల హెచ్ఎం సుధాకర్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షల జవాబుపత్రాలు వచ్చేశాయ్



బండిళ్లను పరిశీలిస్తున్న ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవింద నాయక్

అనంతపురం ఎడ్యుకేషన్: మార్చి–2024లో జరిగే పదో తరగతి పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాలు బుధవారం జిల్లాకు చేరాయి. వాటిని అనంతపురంలోని కేఎస్ఆర్ బాలికల ప్రభుత్వ పాఠశాలలోని స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచారు. ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్ జవాబుపత్రాల బండిళ్లను పరిశీలించారు. జిల్లాలో సుమారు 40,300 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. దాదాపు 5.50 లక్షల జవాబు పత్రాలు జిల్లాకు వచ్చినట్లు గోవిందనాయక్ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గార్లదిన్నె: కల్లూరులో బుధవారం ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించాడు. 108 సిబ్బంది తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రామాంజనేయులు అనే వ్యక్తి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో పడి ఉండగా కుటుంబ సభ్యులు గమనించి 108లో అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు బెంగళూరుకు రెఫర్ చేశారు. ఆత్మహత్య యత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది.